# పక్వైప్

అది వూరికి కాస్త దూరంగా ఉన్న కొండపక్క ఖాళీస్థలం. అందులో ఓ పాతికపైన చిన్న చిన్న 'గుడిశలు' ఉన్నాయ్. వాటిని 'గుడిశలు' అనేకన్నా 'గూళ్ళు' అంటేనే బావుంటుందేమో!

వాటి యజమానులు ఆ చుట్టుపక్కల ముష్టెత్తి బ్రతికే ముష్టివాళ్ళు. పైకి ముష్టివారిలా ఉన్నా వారి వృత్తి మాత్రం అదొక్కటే కాదు.

అడుక్కోవడానికొచ్చి అవకాశం దొరికితే అందింది పట్టుకుపోయి జల్సాచేసే ప్రబుద్ధులు, ఆడతనమే పెట్టుబడిగా పెట్టి అడ్డమైన తిరుగుళ్లు తిరిగి అరటుగోగాలతో 'అలో లక్ష్మణా!' అని ఆక్రోశించే అతివలు, జాతరలు, ఉత్సవాలు జరిగేచోట్ల తప్పనిసరిగా హాజరై అదను చూసుకుని పసిబిడ్డల్ని కైంకర్యంచేసే వృద్ధస్త్రీలు, రకరకాలుగా జీవితాన్ని గడిపేస్తూ తమతమ రహస్యాల్ని పదిలంగా దాచుకుంటూ కేవలం ముష్టివారిలా మనుగడ సాగిస్తున్నారు.

ఊళ్ళోనివారంతా దాన్ని 'ముష్టిగూడెం' అంటారు. ఆ గూడెంలో దాదాపు యాభై, అరవై మంది జనాభా వుండచ్చు. కానీ...కుంటీ గుడ్డీ, మూగా. చెవిటీ లాంటి అవకరాలు ఉన్నవారు తప్ప సర్వాంగాలూ సవ్యంగా ఉన్నవారు ఒక్కరూ లేరు. వాళ్ళ కుక్కలు మాత్రం ఏ అపకరం లేకుండా వాళ్ళు పడేసే ముష్టి తిండికే తెగబలిసి, ఆ ప్రాంతాలకి బైటివాళ్ళని రానీకుండా కాపలా కాసి తమ యజమానులపై విశ్వాసం ప్రకటించుకుంటాయి.

ఎండకి ఎండి, వానకి తడిసి ఆ మురికికూపమే ఇంద్రభవనంలా భావిస్తూ కనిపించిన ఆహారాన్నే పరమాన్నంలా భుజిస్తూ, సిగ్గు, లజ్జల్లాంటివి ఆమడదూరాన నెట్టేసి ఆ గుడిశల చాటునో, లేదా నిండా మూడు గజాలు లేని ఆ గుడిశల్లో పలో తమ కామదాహాన్ని తీర్చుకుంటూ జీవించే ఆ జీవుల్ని చూస్తూంటే మురుగులో ఈదుతున్న తోకపురుగులు గుర్తొస్తాయి.

అయితే అందరికీ ఓటుహక్కుంది. ఉట్టిరోజుల్లో పట్టెడు మెతుకులుగానీ, గుప్పెడు గింజలుగానీ విదిలించని ప్రభువులు ఎలక్షన్స్ ముందుమాత్రం పాపం! చాలా జాలిపడతారు.

ముష్టివాళ్ళందరికీ కూడా స్వంత ఇళ్ళు, వృత్తులు చేసుకోవడానికి ధనసహాయం ఇచ్చితీరుతామని వాగ్దానాలు చేసేస్తారు. అంతర్జాతీయ అంగవైకల్యాల సంవత్సరం కనుక ఇంకా అనేక సమావేశాలు చేయిస్తామని ప్రమాణాలు చేసేస్తారు.

అలాంటి గూడేనికి మకుటంలేని మహారాజు పోలిగాడు. వాడికి దాదాపు ముప్ఫయి సంవత్సరాలుంటాయి. భీమసేనుణ్ణి సైతం చిత్తుగా ఓడించగలనన్న కండబలం, గుండెబలం వున్నాయి. వాడి మాటకి ఎదురులేదు. ఎవరేవైపు అడుక్కోడానికి వెళ్ళాల్సిందీ వాడే నిర్ణయించాలి.

వాడికి చాలా తెలివుంది, ఆరోగ్యం వుంది, అన్నింటికీ మించిన తెగింపు వుంది. లేనిదల్లా ఓ కన్నూ, ఓ కాలు. అయినా అందరికీ వాడంటే భయభక్తులున్నాయి. కుక్కలికూడ తెలుసు వాడి ప్రజ్ఞ.

వాడి చంకలో కర్రలు టక టక లాడించుకుంటూ వస్తూంటే, చక్రవర్తి పంచకల్యాణి అధిరోహించి ఠీవిగా వస్తున్నట్టుండేది. కాదు! అలా అనిపించేది వారికి.

ఆ రోజు గూడెంలో పిల్లా, పెద్దా అంతా చాలా హడావిడిగా వున్నారు. మగవాళ్ళు అంతా అడుక్కోడానికి వెళ్ళిపోయారు ఒక్క పోలిగాడు తప్ప. ఆడవారంతా ఇళ్ళల్లోనే ఉండిపోయారు. కారణం-

పోలిగాడి భార్య లచ్చి కాన్పు నొప్పులు పడుతోంది. పెళ్ళయి పదేళ్లు దాటినా సంతానం కలగని ఆమెకీ కాన్పు అపురూపంగా వుంది.

గుడిసెలోంచి లచ్చి కేకలు రాను రాను పెద్దవవుతున్నాయి. "ముసిలీ! ఏందే? దీనికింకా కానుపు కానేదు?"

భార్య అరుపులు వింటున్న పోలిగాడు బయట్నుంచే అరిచాడు ఆదుర్దాగా గుడిసెలో లచ్చి దగ్గరున్న ముసలమ్మతో.

"ఓరి నీ సోద్దెం గూలా! నీకన్నీతొందరేరా! అసలిది కానుపనుకున్నావా, నేక కడుపునిండా గెంజి తాగినా 'ఆక లమ్మా!' అంటూ అరిసే అరుపనుకున్నావా!" చనువుగా మందలించిందామె.

"అదికాదే! కానుపు గదా...కట్టమైతే..."

"అరె పోలీ! నువ్వాకాడికి పో! అసలు నువ్వేందు కున్నావ్‌రా ఈడ?" తల్లి గదిమింది.

పోలిగాడు బుర్రగోక్కుని కర్రలు టకటక కొట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

*    *    *

ఆ మర్నాడు.

గూడెమంతా విచారంగా, మౌనంగా వుంది.

ఉండి ఉండి పోలిగాడి తల్లి తీసే బుడి బుడి దీర్ఘాలు, "ఏయమ్మ నువ్ నోరు మూస్తావా నేదా?" అన్న కొడుకు గద్దింపులు తప్ప మరే శబ్దంలేదు.

"ఆరి బగమంతుడా! ఈ నలుసుమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాన్రా! మాకింత అన్యాయం సేస్తావని కన్నోకూడా అనుకోనేదురా తండిరీ!" ముక్కు చీదేస్తూనే వుంది ముసల్ది.

"ఇదో ముసిల్దానా! నువ్వోల్లకు! మన సన్నాసి కిస్టిగాడితో సెప్పినాను. ఆడు ఎల్జూసుకుని వస్తానన్నాడు. నువ్వీ

నోగా గొంతు చించుకోమాకి!" కాస్త అనునయంగానూ, కాస్త కోపంగానూ చెప్పాడు పోలిగాడు.

గుడిశలో గోనెపట్టామీద పడుకున్న లచ్చి కళ్ళల్లోంచి నీరు ధారగా ప్రవహించి జుట్టును తడిపేస్తోంది. భర్తమాటలు విన్న ఆమె ఒణికిపోయింది. అప్రయత్నంగా పక్కలోని బిడ్డను చూసుకుంది. వాడు ఈ లోకంతో యేమీ సంబంధం లేనట్టు అమ్మ డొక్కలో ఒదిగి హాయిగా నిద్రపోతున్నాడు.

మూడురోజులు గడిచిపోయాయి.

అందరూ తలా జోలె. బొచ్చా పుచ్చుకుని వూరికేసి వెళ్ళిపోయారు. ముసల్ది, లచ్చి యింటిపట్టునే ఉండిపోయారు. మునల్ది ఏదో గొణుగుతూనే వుంది కోడలికి పుట్టిన బిడ్డగురించి. "నాకు తోడంటూ వుండకుండా ఈ ముసిల్దికూడాపోతే బాగుం డేది" అనుకుంది లచ్చి.

కాని టైములో పోలిగాడు తూలుకుంటూ వచ్చాడు. "ఏందిరా పోలీ?" ఆదుర్దాగా అడిగింది.

"కూసంత జొరం కాసినాదే! కూసేపు తొంగుంటే అదే పోతది" అంటూ ఆ గుడిశలోనే ఇరుక్కున్నట్టు భార్య పక్కనే నడుం వాల్చాడు పోలిగాడు. ముసిల్ది ఏదో గొణు క్కుంటూ బయట దూరంగా కూర్చుని ఈతాకుల చాప అల్లు తోంది.

"మాఁవాఁ!"

"ఏందే?" మూసిన కళ్ళు తెరిచి నీరసంగా అన్నాడు పోలిగాడు.

"కూసంత టీ నీల్లు తాగనేక పోయావా?" అంది లచ్చి భర్త తల నిమురుతూ.

"తాగినానే! ఓ మంసు బిల్ల కూడా ఏసుకున్నా" తిరిగి కళ్ళుమూసుకున్నాడు.

"మాఁవాఁ..."

"ఏందే?" వింతగా చూశాడు పోలిగాడు.

"నేనోమాట అంటాను కోప్పడవుగా?" ఇంతకన్న మంచి సమయం రాదనుకున్న లచ్చి మనసులోనిమాట బయట పెట్టాలని తహతహలాడిపోతోంది.

"కోప్పడతానా? ఏందే అది?" భార్యకేసితిరిగి ప్రేమగా మీద చెయ్యివేశాడు పోలిగాడు.

"మన...బాబుని సూసినావా. ఆ శెంద్రుల్లా నేడూ?" ప్రేమగా పసివాణ్ని చూస్తూ అంది.

"నిజమేనే లచ్చీ! ఆ సందమామకన్న అందంగా ఉన్నాడు నా కొడుకు."

"నిజం?" ఆశతో తళ తళ-మన్నాయి లచ్చి కళ్లు.

"అవును! ఆ సందమామకి మచ్చుంది. మరి నా కొడుక్కి-? మచ్చనేదు!" గర్వంగా నవ్వేడు పోలిగాడు.

"మ...ి...అత్త..."

"ఛ! దానిమాటలు పట్టించుకోపాక" ఓదార్పుగా అన్నాడు పోలిగాడు.

"మాఁవా అయితే..." మెల్లగా అంది లచ్చి.

"అయితే?"

"మనం బాబుని...ఆ కుష్టు కిష్టిగాడికి సూపించవద్దు మావా! నీ కాళ్లట్టుకుంటా" లచ్చి. కంఠం వణికింది.

"లచ్చీ!"

"అవును మావాఁ! మనబాబు మచ్చనేని సంద మామ" బాబు తల నిమురుతూ అంది లచ్చి.

"సరి సఁ! నువ్వు తొంగో! నా కసనే ఒల్లు బానేను" తీవ్రంగా అన్నాడు పోలిగాడు.

అతని కంఠంలో వచ్చిన మార్పుకి ఉసూరుమంది లచ్చి. సంవత్సరం క్రిందట జరిగిన సంఘటన ఆమె కళ్ళెదుట వికటాట్ట హాసం చేసింది.

తమ గుడిశ పక్క గుడిశలో వుండే గుడ్డి మంగమ్మకి కవలపిల్లలు పుట్టారు. ఇద్దరు పుట్టినందుకు ఆనందించినా ఏ అపకారం లేకుండా పుట్టినందుకు కాస్సేపు బాధపడి ఈ సక్సెస్ కిష్టిగాడిచేత ఓ పిల్లకి కళ్ళూ, ఓ పిల్లకి కాళ్ళూ తీయించేసి వారిమీద సంపాదించిన డబ్బుతో హాయిగా బ్రతికేస్తున్నారు. అడపాదడపా ఓ పిల్లని మరో పేట ముష్టివారికి అద్దెకివ్వడంకూడ కద్దు.

సమస్త రోగాలు వున్నవారికి సవ్యమైన బిడ్డలు పుట్టడం అరుదే! కానీ వారి అదృష్టమో, దురదృష్టమో ఒకరిద్దరికి మంచి పిల్లలు పుట్టినా ఈ పెద్దలు సవ్యంగా బ్రతకనీయరు.

ఆరోజు ఆ కవలల దుస్థితి చూసిన లచ్చి హృదయం ద్రవించిపోయింది. వారి ఆర్తనాదాలు ఏ దైవానికీ వినిపించ లేదు. చెయ్యని నేరానికి శిక్ష అనుభవిస్తున్న ఆ పసివాడ్ని కాపాడటానికి ఏ చట్టం ముందుకు రాలేదు. ఏ జాలిగుండె ఆ దారుణాన్ని ఆపలేదు.

ఆ పసివాళ్ళు కళ్ళులేక, కాళ్ళులేక అల్లాడిపోతూంటే ఆ తల్లి సంగతి యేమోగానీ లచ్చి మాత్రం విలవిల్లాడి పోయింది.

అదంతా గుర్తొచ్చిన లచ్చి ఒణికిపోయింది. "ఎలా? నా బిడ్డని కాపాడుకోవడం ఎలా? తను కుంటిది, కాలు కాస్త ఈడుస్తున్నా, ఎడం చెయ్యి అసలు పని చెయ్యదు. వేలాడి పోతుంది" కుమిలిపోయింది.

ఆమె ఎంతో అందంగా వుంటుంది. ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ పుట్టిందో తెలియదు. ముసల్ది చెప్పడం నాలుగేళ్ళ వయసులో ఎక్కడో తిరునాళ్ళలో దొరికిందని. కానీ తనే ఎత్తుకొచ్చి చెయ్యి విరిపించేసిందని లచ్చి నమ్మకం.

ఇన్నాళ్ళూ ముష్టిదానిలానే బ్రతికింది. ముష్టిదాని కొడుకుని కట్టుకుంది. కానీ చాలామందిలా ఆమె పరాయి మగాడి వంక చూసయినా ఎరగదు. బహుశా అది ఆమె రక్తంలోనే ఉందేమో!

ముసల్ది, పోలిగాడుకూడా కొన్నిసార్లు ఆమెని అడ్డం పెట్టుకుని సొమ్ము చేసుకోవాలని చూసినా ఆమె చావనన్నా

చస్తానుగానీ ఈ ఘోరం చెయ్యనడంతో విధిలేక వూరు కున్నాడు.

ఇన్నాళ్ళకి కడుపు పండినందుకు ఆమెపడ్డ సంతోషమంతా ఆవిరయిపోయింది. తన బంగారు బాబుని రక్షించడానికి మార్గం లేని లచ్చి అల్లాడిపోయింది.

“ఎలా? ఈ బాబుని ఆ కిష్టిగాడికళ్ళబడకుండా చెయ్యడం ఎలా?” రాత్రింబవళ్ళు ఇదే ఆలోచన! ఆ కుష్టు కిష్టయ్య పేరెత్తితేనే ఆమెకి పరమ అసహ్యం! భయంతో కోపంతో ఒళ్ళు ఒణికిపోతుంది. అలాంటిది వాడు తన బాబుని చూసి ‘అమ్మో!’ భయంతో ఆమెగుండె వేగంగా కొట్టుకుంటూంది.

వాడి పేరు కిష్టయ్య! వాడికి కుష్టు ముదిరిపోయి ఒళ్ళంతా పుళ్ళతో అసహ్యంగా వుంటాడు. వాడికి లచ్చిమీద తెగ మోజు.

ఎప్పుడు ఎలా మొదలుపెట్టాడో తెలియదుగానీ కన్ను తీసినందుకో రేటు, కాలుకో రేటు, చేతికో రేటు. ఇలా అప్పుడప్పుడు కన్సెషన్ కూడా యిస్తూంటాడు.

కర్మజాలక ఎవరయినా “ఇదేమిటి ఇది మహా పాపం గదా” అంటే ఫళ్ళున నవ్వేసి, “పాపం! ఏది పాపం? అనుకుంటే అన్నీ పాపాలే! ఎవరి వృత్తి వారిది. కటికోడివృత్తి కటికోడిది. ఆ మాటకొస్తే మీరంతా యీ పాపాన్ని నా చేత ఎందుకు చేయిస్తునారు? అది నావృత్తి కాబట్టి! మీరు చేస్తే పాపం అనుకుని. అంతెందుకు పురోసేవోడిది ఉద్యోగమే!

అమ్మో! అంతమందిని చంపుతావు పాపంగాదూ?" అంటే అ పనెవురుసేస్తారు?" అంటూ పెద్ద లెక్చర్ ఇస్తూంటాడు.

అన్నింటికన్న వాడిమాట తమాషాగా వుంటుంది. వీళ్ళందరికన్న కాస్త స్వచ్ఛంగా మాట్లాడతాడు. వాడి ఊత పదం సక్సెస్! ఏది మాట్లాడినా సక్సెస్ అనేమాట రాకుండా మాట్లాడడు. అతనిరేళ్లు, వేరాలు చూస్తే అతనితిల పగల గొట్టాలన్నంత కోపం వస్తుంది లచ్చికి. "సక్సెస్ సచ్చినోడు" గొణుక్కుంటుంది.

ఈరోజు ఆ విషఘుడియ ఆమెకే వచ్చింది. "చంద్రునిలో మచ్చలా తన బాబుకూడా ఓ మచ్చ వుండకూడదూ" అను కుంది వేలగా. తెల్లవార్లూ ఏడుస్తూనేవుంది లచ్చి.

కాస్త కునుకుపడితే చాలు తన బాబు కళ్లు, కాళ్లు లేక "అమ్మ! అమ్మ!" అని తడుముకుంటూ హృదయవిదారకంగా ఏడుస్తున్నట్టు కలలు!

♦ ♦ ♦

"సక్సెస్! మనం ఏ పని ముట్టుకునా సక్సెస్!" ఠీవిగా నవ్వాడు కిష్టయ్య.

"ఇదిగో కిష్టయ్యా! ఆడిగ్గానీ రెండు కల్లు తీసేస్తివా నీ రుణం వుంచుకోం. చక్కదనాల యీ మొగానికి ఆ కల్లుగనా లేకుంటే పతిదొరకీ పుట్టెడు జాలి. ఇంక అంతా బంగారవేఁ!" ఫ్యూచర్ తల్చుకుని తన్మయత్వంగా అంది ముసల్ది.

"అలాగే! నేనట్టుకున్న పని ఏనాడన్నా కాకుండా పోయిందా? ఆఁ రేపు సాయంత్రం వస్తాను. ఇయ్యాల ఇలాంటిదే మరో కేసుంది" పెద్ద సర్జన్‌లా ఫోజుపెట్టి, గర్వంగా కాలరెత్తుకుంటూ నిష్క్రమించాడు కుట్టు కిష్టయ్య.

అతను వెళ్ళగానే భర్తతోనూ, అత్తతోనూ పోట్లాడింది లచ్చి. "నేను కష్టపడి ఆడిన్న, మిమ్మల్ని పోషిస్తా." అంది కాళ్లు పట్టుకుంది.

అన్నింటికీ పోలిగాడు పడీపడీ నవ్వాడు.

"ఎంత పిచ్చిదానివే లచ్చీ! అవిటోల్లదేనే ఈరోజులు. అసలు నీకు తెల్సా? ఇది...ఇకలాంగుల సమ్మత్సరమంట! అంటే మనం ఏదడిగితే అదే ఇచ్చేత్తుందంట పెబుత్వం.

మనం యిలా బతుకుతున్నామంటే ఏటి? మనకున్న ఈ నోపాలు గదూ? దుక్కలాగున్నోడు ముస్టడిగితే "నయ్యాల! యద్దునాగున్నావ్ కష్టం జేసుకోక అడుక్కుంతవ్ రా?" అని మెడట్టుగెంటుతారు.

మనకలాగాదే! ఓ అమ్మగాపోతే ఓ అమ్మ జాలపడుతుంది." జీవిత సత్యం కాచి వడబోసినట్టు చెప్పాడు పోలిగాడు.

ఎన్ని విధాల చెప్పినా వినని భర్తని చూసి ఖిన్నురాలై పోయింది లచ్చి. "ఈ రాత్రి తెల్లవారకుండా వుంటే ఎంత బాగుండు!" అనుకుంది.

"రేపు నా బాబు గుడ్డోడై పోతాడు. కన్నుగానక భయంతో యేడుస్తాడు! ఎలా...ఎలా ఆపాలి? పోనీ పోలీ

వాళ్ళతో సెప్తే? కానీ తను కదిలేదెలా? అడుగేస్తే వందకళ్ళు సూస్తాయే! అయితే మరేటి దారి? నా బిడ్డ గుడ్డోడై పోవాల్సిందేనా?

లేదు! అన్నేదు. ఈ ముస్టిబతుకు నా బిడ్డని బతకనీను. యెలాగయినా సరే ఈ గుడ్డి జీవితాన్నుంచి అణ్ణి బైటికి నాగి తీరుతాను.

అవును! ఈసారి సక్సెస్ ఆ కిష్టిగోడిది కాదు. నాది. నాదే గెలుపు. అంత సేతకాపోతే అడ్ని సంపి నేను సస్తాను గానీ గుడ్డోడిగా మాత్రం సూడను." దృఢనిశ్చయం చేసుకున్న లచ్చి ఈ వలయంలోంచి యెలా బయటపడాలో ఆలోచించి, ఆలోచించి ఓ పథకం తయారుచేసుకుంది.

అర్ధరాత్రి ఒంటిగంట దాటింది. వేసవి వేడిని భరించలేనివారంతా ఆరుబైటే చాపలు, చింకిగోనెలు వేసుకుని ఆదమరిచి నిద్రపోతున్నారు. ఎంత వుక్కగా వున్నా బాలింతరాలయిన లచ్చిని మాత్రం గుడిసె దాటి రానీలేదు.

మెల్లగా లేచింది లచ్చి. సిద్ధంగా ఉంచుకున్న ఓ చీర ముక్కని మెలితిప్పి తన ఎడం ముంజేతికి కుడిచేత్తో, నోటి సహాయంతో గట్టిగా బిగించింది. పసివాణ్ణి యెదమీదికి లాక్కొని ముంజేతికి కట్టిన గుడ్డని చుట్టు తిప్పి మళ్ళీ అదే చేతి జబ్బమీద కట్టింది. అంటే ఆమె చలనంలేని చేతిలో బాబు బంధితుడై నాడన్నమాట.

వాడికి తల్లి యెదమీద మరీ హాయిగా వుందేమో ఆదమరచి పడుకున్నాడు.

మెల్లగా నిల్చుని మూలనున్న చిన్న కర్ర అందుకుని మెల్లగా గుడిసెనుండి బయటపడి తల వంచుకుని చకచక అడుగులు వేస్తోంది.

వెన్నెల పిండారబోసినట్టుంది. ఎందుకో హఠాత్తుగా కళ్ళు తెరిచిన ముసల్ది దూరంగా పరుగులాంటి నడకతో ఎవరో వెడుతున్నట్లు కనిపించి కీచుగా అరిచింది.

ఆ అరుపుకి తృళ్ళిపడ్డ కుక్కలు గొల్లుమన్నాయి.

"ఏందన్!" చిరాగ్గా అన్నాడు పోలిగాడు ఆవలిస్తూ.

"అరె! పోలీ!"

"ఏందే? నియ్యమ్మ...నుస్ నిదరోవు. మమ్మల్ని పడుకోనీన్!" చిరాగ్గా అని మరోవేపు వత్తిగిలాడు పోలిగాడు. తల్లి అప్పుడప్పుడు అలా రాత్రిపూట లేచి ఏదో చప్పుడైందని అనడం కద్దు. అందుకే వాడంతగా పట్టించుకోలేదు.

"ఆరి సచ్చినోడా! సగరా. అటాపాలి సూడు. దొంగోడ్రా." వాణ్ణి కుదిపి కూర్చోపెట్టింది ముసల్ది.

పోలిగాడి నిద్ర ఎగిరి చక్కాపోయింది? జనాల్లో అందరూ లేచారు. అప్పటికే లచ్చి చాలా దూరం వెళ్ళింది. వూరికీ గూడేనికి మధ్య ఓ బ్రిడ్జి వుంది. దానిక్రింద పొంగులు పారే నీరు చూసేవారికి భయభ్రాంతుల్ని చేస్తుంది.

"ఎవరది?" అరుస్తూ వెంటబడ్డారు గూడెంవారు మొత్తం.

వెనక తనని తరుముకొస్తున్నట్టు వస్తున్న వాళ్ళని చూసి గుండె ఝల్లుమంది లచ్చికి. ఎక్కడ లేని ఓపిక తెచ్చుకుని పరుగు ప్రారంభించింది.

అంతవరకు ఎవరో దొంగ అనుకున్న వారందరికీ ఆ పారిపోయేది లచ్చేనని స్పష్టమైపోయింది.

"నయ్యాల దొంగనంజ! ఎంత దయిర్నవే నీకు? నా కెరక నేకుండా పారిపోయి నువ్ బతుకుదాంవనే?" నిప్పులు కురిపిస్తూ కఱ్ఱ సాయంతో పరుగు ప్రారంభించాడు పోలిగాడు.

"అవునో లేయ్! మన పెంటిపిల్ల గోడికె కాలు దీసిస్తే పోలీసోలకి జెప్పమందంట!" అగ్నిలో ఆజ్యం పోసింది ముసల్ది.

"ఏందీ? పోలీసోల్లకి జెప్పాలా? నయ్యాల! దీనికే పలీసోడు అడ్డవడతాడో సూస్తాను" కోపంతో రెచ్చిపోయిన పోలిగాడు చేతిలోని కఱ్ఱ బలంగా లచ్చికేసి విసిరాడు.

అందరిలోను ఆవేశం పెరిగిపోయింది. దొరికితే ఏ కాలు కాకీలు విరిచి పారేసేలా వున్నాడు.

పోలిగాడు విసిరిన కఱ్ఱ కాలికి తగిలి తూలి పడబోయి నిలదొక్కుకున్న లచ్చి ఆయాసంతో ఒగరుస్తూనే పరుగు వేగం పెంచింది.

కాలికి తగిలిన దెబ్బ ప్రాణభీతిముందు తలవంచి నెప్పి అనే పదాన్ని వెనక్కి నెట్టేసింది

ఈ వత్తిడికి చిరాకు కలిగిన బాబు ఏడుపు ప్రారంభమై అది వెంటనే గుక్కలా మారింది. మెలకువ వాకీ ఆకలిని రెచ్చగొట్టింది.

బాబు యేడుపు ఆపడానికి స్తనం తీసి నోటి కందించాలనే ప్రయత్నాన్ని విరమించి, యే క్షణాన వారి కర్రలు తన నెత్తి పగలగొడతాయో అన్న భీతాహంతో వాడి యేడుపుని లక్ష్యపెట్టకుండా పరుగు సాగించింది లచ్చి.

ఆమె అవిటి అవయవాలు స్వాధీనం తప్పుతున్నాయి. ఒళ్ళంతా చెమటలు! బాబు యేడుపు! యెలాగయినా బ్రిడ్జి దాటేస్తే తన ధ్యేయం తీరినట్లే. ఆపై యెవరూ యేం చెయ్యలేరు. తన ధ్యేయమల్లా ఆ బ్రిడ్జి దాటెయ్యాలి. అవయవాల్ని స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి బ్రహ్మ ప్రయత్నం చేస్తోంది.

హఠాత్తుగా పోలిగాడు కసితో విసిరిన రాయి తలకి తగిలి శివుని తలమీదినుంచి ప్రవహించే గలగలా రక్తం ప్రవహించింది.

క్షణాల్లో రక్తం వరదలై ప్రవహించి లచ్చి బట్టలన్నీ తడిసిపోయాయి. పసివాడి ముఖమంతా రక్తమే.

కళ్ళు బైర్లు కమ్ముతున్న లచ్చి అలాగే తూలుతూ బ్రిడ్జిమీదికి వచ్చేసింది.

అవిటి చేతిలో బందీతుడై గుక్కపెట్టి యేడుస్తున్న పసివాడు టక్కున యేడుపు మానేశాడు.

అంతవరకు ఆకలితో తల్లి స్తనాలకోసం ఆతృతగా వెతుక్కుంటున్న వాడి నోట్లో రక్తధారపడింది. ఆకలి చల్లార్చుకోవడానికి అవకాశం లభించింది.

అది అమ్మ స్తనంలోని క్షీరమో, కాక తల్లి మీద నుంచి ప్రవహించే రుధిరమో వాడికి తెలియదు. వాడికి తెలిసిందల్లా ఆకలి!

రక్తంతో ఒళ్ళు, ముఖం తడిసిపోయినా వాడు ఆ రక్తాన్ని చప్పరించడం మానలేదు.

ఎంత చిత్రం! పుట్టిన మరుక్షణం నుంచి ఆహారం కోసం ఎంత ఆరాటం. ఆకలి తీర్చుకోవడానికెంత తపన! ప్రతి ప్రాణి లేచినది మొదలు ఎన్ని విన్యాసాలు చేసినా ఈ జానెడుపొట్ట నింపుకోవడానికే కదా!

"ఆగు! బ్రిడ్జి మీదికొచ్చేసిన జనం అరిచారు.

ఒక్కసారి వెనుతిరిగి చూసింది లచ్చి. లేడీపిల్ల మీదికి దూకడానికి సిద్ధంగావున్న తోడేళ్ళమందలా కనిపించారామె కళ్ళకి. ఆమెకీ వారికీ ఇరవై గజాల దూరం మాత్రమే ఉంది. అప్పటికింకా బ్రిడ్జి మధ్యనే వుంది లచ్చి.

"అయిపోయింది! ఇంక నడిచే శక్తి లేదు." అనుకున్న లచ్చి ఓసారి పసివాణ్ణి చూసుకుంది. పరిస్థితి ఊహించి పిచ్చిగా నవ్వింది. పసివాణ్ణి ఎడాపెడా ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేసింది. వాణ్ణి గట్టిగా హృదయానికి హత్తుకుంది

"అయిపోయింది! నేనే గెలిశాను. గెలుపు నాదే! ఆ కుష్ఠు కిష్టయ్యది ఓటమి. నా కొడుకు గుడ్డోడు కాదు." పిచ్చిగా అరిచింది. దాని అరుపుకి పరిసరాలు ప్రతిధ్వనించాయి.

లచ్చి ప్రవర్తనకి బిత్తరబోయిన జనం ఓ క్షణం ఆగారు. "లచ్చీ!" అరిచాడు పోలిగాడు అయోమయంగా.

వికృతంగా నవ్వింది లచ్చి.

"అవున్రా! గెలుపునాది. సక్సెస్! నాదే సక్సెస్. ముసిల్దానిది ఓటమి. కాదు! ఆ భగవంతుడిదే ఓటమి! నాదికాదు. నాది...నాది...సక్సెస్." ఆమె అరుపులు గాల్లో కలిసి పోయాయి. లచ్చిని, ఆమె బిడ్డని పొంగులువారి ప్రవహిస్తున్న కృష్ణమ్మతల్లి తన కౌగిలిలోకి ఆప్యాయంగా తీసుకుంది.

"సక్సెస్! సక్సెస్? సక్సెస్."

కిష్టిగాడినోట ఫదేపదే విన్న 'సక్సెస్' అన్న పదంలచ్చి నోట స్పష్టంగా పలికి ఆ పరిసరాల్లో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉంది.

( ఆంధ్రసచిత్రవారపత్రిక )

—o—